www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 20 మే 2025

5

తిరుపతి



రోగుల సహాయార్థం 'స్విమ్స్ సేవ' ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

స్విమ్స్ ఆస్పత్రిలో పేషంట్ల సహాయార్థం శ్రీవారి సేవలు అందించేందుకు స్విమ్స్ సేవను సోమవారం ప్రారంభించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు ఆర్వి కుమార్ మాట్లాడుతూ టిటిడిలో కొనసాగుతున్న శ్రీవారి సేవ మాదిరి స్విమ్స్‌లోనూ ప్రారంభించాలని స్విమ్స్ ఎక్స్ కమిటీ చైర్మన్ బివి సుబ్బారావు, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు ఆదేశాల మేరకు ఈ సేవను ప్రారంభించినట్లు తెలిపారు. 42 విభాగాల్లో వైద్యం తీసుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 1500 మంది పేషంట్లు వస్తున్నారని, వీరిలో చాలా మందికి ఏ వైద్యసేవలు అందుతున్నాయో తెలియడం లేదని, అందుకోసం పేషంట్ల సౌకర్యార్థం స్విమ్స్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఒక బ్యాచ్‌ను 20 మందిని సహాయకులుగా ఏర్పాటు చేశామన్నారు.

తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి నియామకంపై...

బాబు 'గురి' ఎటో..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాజకీయాలను శాసించే తిరుపతిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోస్టు ఖాళీగా ఉంది. ఆశావాహులుగా నలుగురు బరిలో ఉన్నారు. మొన్నటివరకూ ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మకు 'గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్' రాష్ట్రస్థాయి పదవిని కట్టబెట్టారు. సుగుణమ్మకు వయోభారంతో పాటు, నామినేటెడ్ పదవి లభించడంతో ఆమెకు ఈ పదవి చేజారినట్లే. పలువురు పోటీ ఉండడంతో అధినేత చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతి నియోజకవర్గంలో ఆశావాహులపై 'వాట్సాప్ సర్వే' నిర్వహిస్తుండటం గమనార్హం. పోటీ పడుతున్న వారిలో మాజీ ఎంఎల్‌ఎ మబ్బురామిరెడ్డి కుమారుడు మబ్బు దేవనారాయణరెడ్డి (పెద్దబ్బ), డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్, ఎడిఫై స్కూల్ అధినేత ప్రణీత్ ఉన్నారు.

సుగుణమ్మ, వూకా 'ఔట్'

తిరుపతి అత్యంత కీలక నియోజకవర్గం. వివిఐపిలు నిత్యం వచ్చి వెళ్లే ఆధ్యాత్మిక, రాజకీయ కేంద్రం. 2024 ఎన్నికల్లో టిడిపి తన మిత్రపక్షమైన జనసేనకు ఎంఎల్‌ఎ సీటును కేటాయించి గెలిపించుకుంది. తాజాగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మకు గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టింది. రాబోయే మేయర్ ఎన్నికల్లో ఆమె మనవరాలికి ప్రాధాన్యత ఇస్తామని టిడిపి అధిష్టానం హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరి మేయర్ సీటును ఆశిస్తున్న 'అన్నా' కుటుంబాన్ని ఏం చేస్తారో వేచి చూడాల్సిందే. గత ఎన్నికల్లో టిడిపి టికెట్‌కోసం ప్రయత్నించిన వూకా విజయ్‌కుమార్‌కు అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పదవి ఇవ్వడంతో ఆయన కూడా రేస్‌నుంచి తప్పుకున్నట్లే. తాజాగా ఇన్‌ఛార్జి పదవి కీలకం కావడంతో పార్టీ సీనియర్లు ప్రయత్నాలు సాగిస్తున్నారు. జేబీ శ్రీనివాస్, మబ్బు దేవనారాయణరెడ్డి, ఎడిఫై విద్యాసంస్థల అధినేత ప్రణీత్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం లాబీయింగ్ చేస్తున్నారు. వీరంతా తొలుత తుడా ఛైర్మన్ ఆశించినవారే. డాలర్స్ దివాకర్‌రెడ్డికి అవకాశం ఇవ్వడంతో, తాజాగా ఇన్‌ఛార్జి పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

సభ్యత్వ నమోదులో 'మైనస్'

టిడిపి సీటును జనసేనకు కేటాయించడంతో అధికారం చేపట్టినప్పటి నుంచి క్యాడర్ నిస్తేజంగానే ఉంది. ఎవరికి వారే నాయకులుగా వ్యవహరిస్తుండడంతో సభ్యత్వ నమోదులో వెనకబడింది. టిడిపి అధినేతలు నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వచ్చినపుడు మాత్రమే నాయకులు హడావిడి చేయడం, ఆ తరువాత కనిపించడం లేదనే వాదన ఉంది. ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికలలో చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు చివరి నిమిషంలో తిరుపతి, చంద్రగిరి నాయకులు ఎంటర్ అయి ఫలితాన్ని టీడీపీకి అనుకూలంగా మార్చారు. మొదటి రోజే ఎన్నిక జరిగిఉంటే ఖచ్చితంగా వైసీపీ అభ్యర్థి విజయం సాధించేవారన్న టాక్ ఉంది.

జేబీ, మబ్బుల వైపు మొగ్గు

జేబీ శ్రీనివాస్, మబ్బు దేవనారాయణరెడ్డిల పట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. వారిద్దరికీ బలమైన క్యాడర్ ఉంది. మాస్ లీడర్లుగానూ ఉన్నారు. అయితే విద్యాసంస్థ అధినేత ప్రణీత్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో సంబంధాలు, చంద్రబాబు కుటుంబ సభ్యులతో పరిచయాలు ఉన్నాయి. ఆయన చేసే సేవా కార్యక్రమాల పట్ల అభినందనలు అందుకున్న సందర్భాలు ఉన్నాయి. కోడూరు బాలసుబ్రమణ్యం నిరంతరం అధినేతలకు టచ్‌లోఉన్నారు. ప్రముఖంగా ఈ నలుగురిలో ఎవరికైతే 2029 ఎన్నికల్లో పార్టీని సమర్థవంతంగా నడిపేవారు ఎవరన్నది సర్వే ద్వారానూ అధినేతలు అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. వైసిపి మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఫ్యామిలీ ఇప్పటికే యాక్టివ్ రోల్ ప్లే చేస్తుంది. వీరిని సమర్థవంతంగా తిప్పికొట్టగల 'మాస్' లీడర్‌నే ఎంపిక చేయాలనేది అధినేత ఆలోచన. ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సుగుణమ్మ ప్రమాణ స్వీకారం

చిత్తూరు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు ఇద్దరికీ నామినేటేడ్ పదవులు

తిరుపతిలో బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉండడంతో ఇక్కడ బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఆ సామాజిక వర్గానికి అవకాశం వస్తుందని అంటున్నారు. దానికితోడు నియోజకవర్గ పునర్విభజన మీద చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో రెడ్డి సామాజిక వర్గ నాయకులకు అక్కడ అవకాశం వస్తుందని అంటున్నారు.మరోవైపు మహానాడుకు ముందు జిల్లా అధ్యక్షులను సైతం మార్చి వేసి ఎమ్మెల్యేలకు కాని సీనియర్ నాయకులకు కాని అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. చిత్తూరు , తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు ఇద్దరికీ నామినేటేడ్ పదవులు రావడంతో వారిని కూడా మారుస్తారని అంటున్నారు. టీడీపీ అధిష్టానం ఆశావహుల్లో ఎవరిపై నమ్మకం ఉంచుతుందో వేచి చూడాల్సిందే.

టీడీపీ మండల అధ్యక్షులుగా రావిళ్ల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులుగా రావిళ్ల మునిరాజా నాయుడు నియమితులయ్యారు. ఆయన ఎంపికను ధ్రువీకరిస్తూ సోమవారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నియామక పత్రం అందజేశారు. రావిళ్ళ మునిరాజా నాయుడు గతంలో శ్రీకాళహస్తి పాల సొసైటీ ఛైర్మన్ గా పనిచేశారు. నిబద్ధత కలిగిన కార్యకర్తగా గుర్తింపు పొందారు. పార్టీ కష్ట, నష్టాల్లో పాలుపంచుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన టీడీపీ అధిష్టానం మండల అధ్యక్షులుగా నియమిస్తూ గౌరవిచ్చింది. తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులుగా రావిళ్ల మునిరాజా నాయుడు నియమితులవ్వడం పట్ల పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సుగుణమ్మ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏపీ గ్రీనింగ్ అండ్ అర్బన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ సోమవారం విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఎండి శ్రీనివాసులు పాల్గొన్నారు. అధినేత చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని గ్రామాలు, నగరాలను అందంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, టిడిపి నాయకులు కంకణాల రజనీకాంత్‌నాయుడు తదితరులు ఆమెను అభినందించారు.

తిరుపతిలో సిపిఎం కాగడాల ప్రదర్శన

వెంకటగిరిలో..

జనం గుండెల్లో చిరస్మరణీయుడు సుందరయ్య

- తిరుపతిలో కాగడాల ప్రదర్శన
- గూడూరులో రక్తదానం
- జిల్లావ్యాప్తంగా నివాళి

పుత్తూరులో...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్థంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణులు అరుణాంజలి ఘటించాయి. గూడూరులో రక్తదాన శిబిరం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని శ్రేణులు ప్రతినబూనాయి. తిరుపతి రైల్వే కాలనీ, యశోదనగర్ ప్రాంతాల్లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ సుందరయ్య మరణించి నేటికి 40 సంవత్సరాలు కావస్తున్నా చిరస్మరణీయంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని రాజకీయాలు నడపాలన్నారు.

గూడూరు టౌన్‌లో.. చెన్నూరు గ్రామంలో డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది దాతలు ముందుకొచ్చి రక్తదానం చేశారు. తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శి వందవాసి నాగరాజు, నెల్లూరు జిల్లా చేతివృత్తుల సమన్వయ కమిటీ కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, గూడూరు కన్వీనర్ జోగి శివకుమార్, రెడ్‌క్రాస్ సంస్థ మోటివేటర్ ఎం.మధు, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల డాక్టర్ ముంగర తేజ, చెన్నూరు సిపిఎం కార్యదర్శి గుర్రం రమణయ్య పాల్గొన్నారు. గూడూరు జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు.

గూడూరులో..

తిరుపతి టౌన్‌లో.. తిరుపతి సిపిఎం కార్యాలయంలోనూ, సుందరయ్యనగర్‌లోని కమ్యూనిటీ హాలులోనూ కమ్యూనిస్టు దిగ్గజం సుందరయ్యకు నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నివాళి అర్పించి జెండావిష్కరణ చేశారు. నాయకులు కె.వేణుగోపాల్, జయచంద్ర, సాయిలక్ష్మి, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ప్రజాశక్తి మేనేజర్ సిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

- **రేణిగుంటలో..** సిపిఎం కార్యాలయంలో నివాళి అర్పించారు. ప్రాంతీయ కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, వెంకటరమణ, చల్లా వెంకటయ్య, ఈశ్వరమ్మ, కుప్పస్వామి పాల్గొన్నారు. కరకంబాడి, తారకరామనగర్, సుందరయ్య కాలనీల్లో శాఖ కార్యదర్శి సత్యశ్రీ ఆధ్వర్యంలో జరిగింది.
- **శ్రీకాళహస్తిలో..** పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, వెంకటేష్, వేణు, సంక్రాంతి వెంకటయ్య పాల్గొన్నారు.
- **ఏర్పేడులో...** సిపిఎం నాయకులు రంగయ్య, రాంబాబు, చంద్ర, ధర్మారెడ్డి తదితరులు సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు.
- **పిచ్చాటూరులో..** ఓబులరాజు కండ్రిగలో సిపిఎం జిల్లా నాయకులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఓబులరాజు కండ్రిగ దళితుల బాటను ఆక్రమించిన భూస్వామిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ, పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నాగలాపురం నాగరాజు, శ్రీరాములు, మాతయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.
- **కెవిబిపురంలో..** ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.
- **వెంకటగిరి టౌన్‌లో..** నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో కాశీపేట ఏరియాలో సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. రాజయ్య, రత్నమ్మ, చిరంజీవి, ఎల్లమ్మ, చందు పాల్గొన్నారు.
- **సత్యవేడులో..** ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టి.మురళి, తిరుమలరెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.
- **పుత్తూరులో..** ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ ఆటోస్టాండ్ వద్ద నిర్వహించారు. ఎ.విజయ్, కెఆర్ సుబ్రమణ్యం, నరసింహులు, పురుషోత్తం పాల్గొన్నారు.
- **ఓజిలిలో** ఏనుగువాడ గ్రామంలో చనగ చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాంతీయ నాయకులు శివకవి ముకుంద సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎం.శ్రీనివాసులు, టి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నాయుడుపేటలో...

పిచ్చాటూరులో..

జేమ్స్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)/ శ్రీకాళహస్తి

తిరుపతి శ్రీ విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో థర్డ్ ఇయర్ చదవుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి సిపిఎం, కెవిపిఎస్ నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, సుమన్, వెంకటేష్ తదితరులు వినతిపత్రం అందించారు. దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లేడ్, వారి గ్యాంగ్‌లపై కేసులు నమోదు చేయాలన్నారు. జేమ్స్‌ను ప్రతిరోజూ కాలేజీకి వెళ్లిన సందర్భంగా తక్కువ జాతి వాడివని, అంబేద్కర్ కులానికి చెందిన వాడని అవహేళన చేస్తూ ఏడిపించేవాళ్లని, దీన్ని ప్రశ్నించినందుకు రెండు రోజుల క్రితం జేమ్స్‌ను కిడ్నాప్ చేసి, నోట్లో మూత్రం పోసి ఒకటిన్నర రోజుల పాటు చిత్రహింసలకు గురిచేశారన్నారు. తప్పించుకుని రుయాలో జేమ్స్ చికిత్స పొందుతున్నాడన్నారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు కాలేజీల్లో పునరావృతం కాకుండా చూడాలన్నారు.

శ్రీకాళహస్తి.. ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్ పై పాశవికంగా దాడి చేసి, కులదురహంకారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. జేమ్స్ పై దాడికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రాధమ్మ, కుమార్, వేణు, వెంకటేష్,, రాజా, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బారినుంచి కాపాడండి

కలెక్టర్‌కు రైతుసంఘం వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 257 అర్జీలు అందాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డిఆర్‌ఒ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్ పాల్గొన్నారు.

మామండూరులో 25 సంవత్సరాల మామిడిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయని, ఏనుగుల బారినుంచి తమను, తమ పంటలను కాపాడాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో 15 మంది రైతులు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా నష్టపరిహారం గానీ, రక్షణ గానలి కల్పించలేదన్నారు. ఎపుడో తవ్విన కందకం నేడు పూడిపోయిందని తెలిపారు. 130 ఎకరాలకు కరెంట్, దారి సౌకర్యం లేదన్నారు. దీంతో ఏనుగుల ఘీంకారాలకు భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. ఏనుగులు రాకుండా శాశ్వతంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం నాయకులు హరి మద్దతు తెలిపారు. కుషీద్, మాధవి, ఎం చిట్టెమ్మ, ఈశ్వరయ్య, గోపి ,పి. సరస్వతి తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

- శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు గ్రామ లెక్క దాఖలాలో అపాచీ సంస్థకు భూసేకరణలో భాగంగా తన మామ కొండే లక్ష్మణారెడ్డికి ఎక్స్ సర్వీసెస్‌లో కేటాయించిన భూమిని సేకరించారని అల్లుడు కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. 5.20 ఎకరాలను అపాచీ సంస్థకు కేటాయిస్తే, నష్టపరిహారం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, భూమి కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించాలని తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి వాస్తవ్యుడు కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు.
- తిరుపతి రూరల్ మండల కేంద్రంలో ఉద్యానవన శాఖ పరిధిలో పనిచేస్తున్న 32 మంది కార్మికులకు సంబంధించి పిఎఫ్ ఖాతాలో డబ్బు జమ చేయకుండా అధికారులు కాంట్రాక్టర్‌తో మిలాఖత్ అయ్యారని సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర విమర్శించారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
- రేణిగుంట మండలంలో ప్రభుత్వ భూమిని కలుపుకొని వెంచర్ ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ప్రభుత్వ అధికారులు లోపాయి గారి ఒప్పందంతో కట్టబెట్టారని కృష్ణాపురం వాస్తవ్యుడు రవి పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఐదుసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు.

వర్షాల వల్ల ఇబ్బంది లేకుండా చూడండి : కమిషనర్

తిరుపతి టౌన్ : వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ కి ఫోన్ ద్వారా 10 మంది సమస్యలు తెలుపగా, 32 మంది నేరుగా వచ్చి కమిషనర్ కు వినతులు అందజేశారు. శ్రీనివాసపురం వద్ద డ్రైనేజీ కాలువ పనులు చేయాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు.

నేడు టిటిడి పాలకమండలి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో మంగళవారం టీటీడీ పాలకమండలి సమావేశం జరగనుంది. చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు బోర్డు సమావేశం ప్రారంభించడానికి టిటిడి ఏర్పాట్లు చేసింది. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రి డెవలప్మెంట్ పై పలు నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం. తిరుమలలోని పలు క్యాంటీన్ లకు టెండర్లు పిలిచేందుకు నిర్ణయం తీసుకోనున్నారు. భక్తులకు నాణ్యమైన ఆహారం విక్రయించగల....గుర్తింపు ఉన్న ప్రముఖ సంస్థలకు టెండర్ లో పాల్గొనే అవకాశం ఉందని తెలిస్తోంది. తిరుమలలో పలు మఠాల ఆక్రమణలపై సర్వే రిపోర్ట్ ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నారు. హామీ మేరకు పోటు కార్మికుల వేతనాలు పెంచే అవకాశం ఉంది. ఉద్యోగుల పేరు బ్యాడ్జిపైనా చర్చ నడవనుంది. మొత్తం 38 అజెండా అంశాలపై చర్చించనున్నారు.

'లడ్డు పోటు'కు టిటిడి మరమ్మతులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల లడ్డు తయారీ పోటు (వంటశాల)పై భాగంలో 35వేల పగుళ్లను టిటిడి ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. వర్షం పడితే సన్నసన్నని చుక్కలు పడటం వల్ల మరమ్మతుల వైపు దృష్టి సారించారు. అయితే ఆలయం లోపల ఉండే ఎలాంటి మరమ్మతులు చేయాలన్నా ఆగమ సలహాదారుల సూచనలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ అధికారులు టిటిడి ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు అధికారులు సమన్వయంతో టిటిడి పాలకమండలి అధ్యక్షులు బిఆర్ నాయుడును సంప్రదించారు. మౌలిక వసతుల కల్పనలో ఈవో, అదనపు ఈవో చేస్తున్న కృషిని ఛైర్మన్ అభినందించారు. ఆలయ గర్భగుడిలోని లడ్డు పోటులో మరమ్మతులు చేయాలంటే ఆగమ సలహా తీసుకోవాలని సూచించారు. ఆగమ సలహాదారుల సూచన మేరకు మార్పులు చేర్పులు ఉండవు కాబట్టి, మరమ్మతులను శాస్త్రీయ పద్ధతిలో చేసుకోవచ్చని సూచించారు. స్వల్ప పగుళ్ల 35వేలు ఉన్నాయని గుర్తించారు. పనులను సివిఎస్ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం పనులు ఎవరికీ ఆటంకం కలగకుండా జరుగుతున్నాయి. మరమ్మతు పనులు పూర్తవ్వాలంటే ఆగస్టు నెల వరకూ సమయం పడుతుందని సివిఎస్ కంపెనీ పేర్కొంది.

తిరుపతిలో హౌసింగ్ జియో ట్యాగింగ్ మేళా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. జియో ట్యాగింగ్‌కు వెళ్ళే లబ్ధిదారుల వాహనాలను సోమవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో తిరుపతి నగరంలో ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు చిందేపల్లి, ఎం.కొత్తపల్లి, కల్లూరు లేఔట్లలో నిర్మిస్తున్న ఇళ్లకు జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 19,086 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 10 వేల మందికి జియో ట్యాగింగ్ పూర్తయిందని, మిగతా పెండింగ్ లబ్ధిదారులకు ఈ 19, 20, 21 తేదీలలో మూడు రోజులపాటు 9086 మంది లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మూడు రోజులలో ఎవరైనా వెళ్లకపోతే మిగతా రోజులలో లబ్ధిదారులు వారికి ఇచ్చిన ఇంటి పట్టా ఆధారంగా లేఅవుట్ కు వెళ్లి లబ్ధిదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

కెవిబిపురం : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం రైతు తండ్రి, సోదరునితో కలిసి మండల వ్యవసాయ అధికారికి, తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కెవిబిపురం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన యువ రైతు చంద్రబాబు అప్పులు చేసి, పంటలు పండిస్తే నష్టాల పాలయ్యాడన్నారు. ఒత్తిడి తట్టుకోలేక పురుగుల మందు తాగి డిసెంబర్ నెలలో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. బాధితునికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, మృతుని తండ్రి జూలయ్య పాల్గొన్నారు.

ఐసిఐ రీజినల్ ప్రెసిడెంట్‌గా తహసున్నిసా బేగం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్‌గా తహసునిసా బేగం ఎంపికయ్యారు. కన్వెన్షన్ ఐకాన్ 2025 హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా మాధవి, సెక్రటరీగా వెంకటరావు, గంప భరత్ ఎన్నికయ్యారు. ప్రస్తుత ఐసిఐ విస్డం క్లబ్ ప్రెసిడెంట్ తహ సున్నిసా బేగంను రీజనల్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తహసున్నిసా బేగం మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లకు, కాలేజీలకు తాను ఇస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చిందన్నారు.

రేపు డిఇఒ కార్యాలయ ముట్టడి : యుటిఎఫ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఉపాధ్యాయుల బదిలీ నిబంధనలు సవరించాలని కోరుతూ 21న బుధవారం చిత్తూరు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యులు ముత్యాలరెడ్డి, జగన్నాథం, సురేష్, సాంబిరెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలోపెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 117 జీవోను రద్దు చేయమని రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ, ప్రభుత్వం 117 జీవో రద్దు పేరుతో గతంలో ఆరుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించిందని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఉన్న భౌతిక, సామాజిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలలను పునర్వ్యవస్థకించడం జరిగిందని, దీనిద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా వచ్చాయని పేర్కొన్నారు. దాంతో పాటు మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ స్కూల్ పేరుతో తరలించడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోవడంతో పాటు, చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇతర ప్రాంతాలకు చేరుకోవడం కష్టమవుతుందని, దీనిని సవరించాలని కోరారు. అలాగే బదిలీ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల యొక్క ప్రతిపాదనలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.సింగ్ డిఈఈ లు మోహనరావు, శ్రీనివాస్, కుమార్, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు పాల్గొన్నారు.

మట్టిపోసి 'మమ' అనిపించారు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ రహదారి గత ఐదేళ్లుగా అధ్వానంగా తయారైంది. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నా, వాహన రాకపోకలు తక్కువగా ఉండేవి. పెద్దగా సమస్యలు ఎదురయ్యేవి కావు. ప్రస్తుతం సూళ్లూరుపేట, వరదయ్యపాళెం మండలాల్లో భారీ సంఖ్యలో పరిశ్రమలు ఆవిర్భవించాయి. వాహనాల రద్దీ పెరిగింది. దీంతో ఈ సింగిల్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈనేపథ్యంలో ఇటీవల శ్రీహరికోటలోని షార్‌ను సందర్శించేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తమ రహదారి ఇబ్బందులను స్థానిక నాయకులు తీసువెళ్లారు. స్పందించిన ఆయన రహదారి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో రహదారికి ఇరువైపుల మట్టి పోశారు. రహదారి మధ్యలో గుంతలు పూడ్చారు. కొంతమేర ప్యాచ్ వర్క్ చేశారు. కానీ ప్రస్తుతం చేపడుతున్న పనులు తాత్కాలికమేనని వాహనదారులు చోదకులు పెదవి విరుస్తున్నారు. ఓ మోస్తరు వర్షం కురిసినా ఈ రహదారి గతంలో మాదిరిగా గుంతలమయమవుతోందన్నారు. బీఎన్ కండ్రిగ నుంచి గాజులపెళ్లూరు వరకు అసలు పనులే చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రెండు వరుసల రహదారి నిర్మాణమొక్కటే శాశ్వత పరిష్కారమని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దళిత విద్యార్థిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి దారుణమైన చర్య అని, ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా భీమ్ గ్యాంగ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయ్యాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.డాక్టర్ సాయి లక్ష్మి, గిరిజన జిల్లా కార్యదర్శి వై.నరసయ్య, తిరుపతి రూరల్ కార్యదర్శి కే.సుమన్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

దళితులే లక్ష్యంగా దాడులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని వైసీపీ నాయకుడు గురునాథం విమర్శించారు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో అణిచి వేయాలని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు దర్యాప్తు చేయడం లేదన్నారు. ఇలాంటి దాడులకి, కేసులకి భయపడి తగ్గే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. దళితుల మీద దాడులు ఆపకపోతే ప్రభుత్వ విధానాలపై నిరసనలు జరుపుతామని హెచ్చరించారు.

క్షతగాత్రుడికి న్యాయం జరిగేనా..?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని బొజ్జ నత్తం గ్రామానికి చెందిన కసిరాజు పుత్తిరత్తా మున్సిపాలిటీ జెసిబి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి తన సొంత పని మీద తన ద్విచక్ర వాహనంపై, తన అనుచరుడితో అగ్రహారం నుండి బొజ్జనత్తం గ్రామానికి తిరిగి వస్తుండగా పున్నమి హోటల్ క్రాస్ సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సరిగా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు 34 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పది సప్లిమెంటరీ పరీక్షలకు 80 మందికి గాను 46 మంది విద్యార్థులు హాజరయ్యారని, 34 మంది గైర్హాజరయ్యారని డిపార్ట్మెంట్ ఆఫీసర్ సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలియజేశారు.

చెత్త తీసుకెళ్లే లారీకి అద్దం ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ పుత్తూరు మున్సిపాలిటీలో ప్రతినిత్యం చెత్త తీసుకొని వెళ్లే లారీకి డ్రైవర్ సీటు ముందు అద్దం లేకుండా, పాలిథిన్ కవర్ అంటించుకొని గత సంవత్సరం రోజులుగా చెత్త తీసుకెళ్తున్నారు. మున్సిపాలిటీలో నిధులు పుష్కలంగా ఉన్నా అధికారులు పర్యవేక్షణ కరువని కార్మికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అద్దం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం సహాయ నిధి పరిహారం చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి నుండి మంజూరైన 12 లక్షల 90 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా ఇప్పటికే అనేక మందికి ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, మోహన్ రెడ్డి, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడుగా కత్తి రవి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతిలో గత నాలుగు రోజులుగా అఖిల భారతీయ యువ జన సమైక్య 175 జాతీయ యువజన మహాసభలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ మహాసభలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన కత్తి రవిని ఆదివారం ఎ.ఐ వై.ఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేశారు. రవికి తనతో పాటు చదివిన విద్యార్థులు, యువజన సమైక్యవాదులు అభినందనలు తెలిపారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు డివిజన్ పరిధిలోని సమస్యలు వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ రాఘు వేంద్ర మీనా తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ప్రదానంగా భూ సమస్యలు మీద వినతులు స్వీకరించారు. త్వరిత గతిన సమస్యలను పరిష్కారిస్తామన్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం కొలువు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం కొలువుదీరింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. అధ్యక్షులుగా వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శిగా కార్తీక్ నాయుడు, పీఆర్వోగా పరిటాల ఈశ్వర్, గౌరవాధ్యక్షులుగా వై.చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా కావేరిపాకం వెంకటేష్ తదితరులు ప్రమాణం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి నూతన కార్యవర్గం పాటుపడుతుందని అన్నారు. పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

నీలం సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపించిన తర్వాత ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన నీలం సంజీవ రెడ్డి వర్సిటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఇన్చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. నీలం సంజీవ రెడ్డి 112వ జయంతిని సోమవారం యూనివర్శిటీలో ఘనంగా నిర్వహించారు. సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ఆ చార్య ఎం.భూపతి నాయుడు, ఇంజనీర్ ఇన్‌చార్జ్ తాండవ కృష్ణ విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహాసంప్రోక్షణ

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, ఓబుల్ రాజుల కండ్రిగ, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగిన మహాసంప్రోక్షణ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, వైఎస్ఆర్సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బీరేంద్ర వర్మ, సుశీల్ కుమార్ రెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేలూరు రాజేష్, బెల్ట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంతోత్సవాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి): శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 3 రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి.

ఆర్సీపురం టిడిపి అధ్యక్షుడిగా మేకల తిరుమలరెడ్డి

తిరుమల్ రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: ఆర్ సి పురం మండల టీడీపీ అధ్యక్షుడిగా రాయలచెరువు పేట గ్రామానికి చెందిన మేకల తిరుమలరెడ్డిని తిరిగి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మిట్టూరు కమ్యూనిటీ హాల్లో టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులు వి.గణపతి నాయుడు, భాస్కర్ రెడ్డి, ఒంటి మునిశేఖర్ రాయల్ మండల టిడిపి కమిటీ సభ్యులను ప్రకటించారు. మండల టిడిపి ఉపాధ్యక్షులుగా కే.గిరిధర్ రెడ్డి, టి.మురళీమోహన్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రావిళ్ళ గిరినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎన్.కమలాకర్ రెడ్డి, కె. రాఘవేంద్ర నాయుడు, టీ.వెంకటేష్ రెడ్డి, కార్యదర్శులుగా పంతల వెంకటేష్ నాయుడు, సి.రవి ప్రసాద్, వాసు యాదవ్, కోశాధికారిగా మధుసూధన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎం.తిరుమలరెడ్డి ఎమ్మెల్యే పులివర్తి నాని విజయానికి కృషి చేశారని తెలిపారు. మేకల తిరుమలరెడ్డి పనితీరును గుర్తించి ఎమ్మెల్యే పులివర్తి నాని, నాయకులు తిరిగి రెండవసారి అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల టిడిపి కమిటీలో పార్టీ విజయానికి కష్టపడిన ప్రతి నాయకులను గుర్తించి పదవులు కట్టబెట్టినట్లు పరిశీలకులు వి గణపతి నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు టిడిపి మాజీ అధ్యక్షుడు ఈ ఉమాపతి నాయుడు, మాజీ ఎంపీపీ కేశవుల నాయుడు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు, చేకూరి జనార్ధన్ చౌదరి, పసుపులేటి విజయ్ కుమార్, నరసింహారెడ్డి, సురేష్ నాయుడు, ధనంజయ చౌదరి, లెక్కల మహేష్ నాయుడు, దినేష్ చౌదరి, కే ముద్దుకృష్ణారెడ్డి చిరంజీవి, బండి విజయ్ కుమార్ రెడ్డి, ఆకా దేవరాజులు, బి రమణారెడ్డి, నాగభూషణం, మహిళా నాయకురాలు సుగుణమ్మ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టయోటా కిర్లోస్కర్ మెగా సమ్మర్ సెలబ్రేషన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వేసవిని పురస్కరించుకుని టయోటా కిర్లోస్కర్ మోటర్ మెగా సమ్మర్ సెలబ్రేషన్ ప్రారంభించినట్లు ఆ సంస్థ సౌత్ రీజియన్, చీఫ్ రిప్రజెంటేటివ్ – వైస్ ప్రెసిడెంట్, వైస్‌లైన్ సిగామణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అధీకృత టొయోటా డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కొత్త కారు కొనడం, ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం, సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించటం, వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం, ఆకర్షణీయమైన డీల్‌ను పొందటం దీనితో సాధ్యమవుతుందన్నారు. తమ లక్ష్యం అసాధారణమైన వాహనాలను అందించడంపై మాత్రమే కాదు, ప్రతి కస్టమర్ సంతృప్తితో ఉండటమేనని తెలిపారు. 'మెగా సమ్మర్ సెలబ్రేషన్'తో, టొయోటా యాజమాన్య అనుభవానికి మరింత విలువను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ వేడుకలో భాగంగా, ఉచిత కార్ హెల్త్ చెకప్ అందిస్తున్నామన్నారు. తద్వారా కస్టమర్లు నమ్మకంగా, ఉత్సాహంగా, మనశ్శాంతితో వేసవిలోకి డ్రైవ్ చేయవచ్చన్నారు. వినియోగదారుల దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: యర్రావారిపాలెం మండలంలో టిడిపి మండల, గ్రామ కమిటీలను ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు నియమించినట్లు పరిశీలకులు నీలకంఠ చౌదరి, రామిరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల పార్టీ కమిటీలో అధ్యక్షులుగా దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర నాయుడు, బీసీ సెల్ అధ్యక్షులుగా గొల్లపల్లి బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా విజయకుమార్ నాయక్, యువత అధ్యక్షులుగా నిరంజన్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలుగా కోమ్మక లక్ష్మీదేవి, వాణిజ్యభాగం అధ్యక్షులుగా శ్రీధర్ బాబు, టిఎన్టియుసి అధ్యక్షులుగా ఆంజనేయులు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులుగా చరణ్ రాజు, ఐటిడిపి అధ్యక్షులుగా మురళిని నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామ కమిటీలకు సంబంధించి వుస్తికాయలపెంట – గోపాల్, ఎల్లమంద – రమణ, కోటకాడపల్లి – వెంకటరత్నం, బోడేవాండ్లపల్లి – హేమ రత్నం, విఆర్ అగ్రహారం–మహేష్, నెరబైలు–శ్రీనాథ్, కమల్ల – జైపాల్ రెడ్డి, కూరపర్తివారిపల్లి – రెడ్డి బాబు, ఉదయమాణిక్యం – ఈశ్వరయ్య, చెరుకువారిపల్లి – చంద్రబాబు నాయుడు, చింతగుంట – వెంకటరమణలను గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు నియమించినట్లు కమిటీ పరిశీలకులు తెలిపారు.

నేడు ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ రాక

ప్రజాశక్తి-కోట: నెల్లూరు అపోలో హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ నెల్లూరు నుండి అనుభవం కలిగిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ నితీష్ పగడాల కోట, ఎన్.సి.ఆర్ నగర్, జనతా క్లినిక్ ఆసుపత్రికి ఈరోజు వస్తున్నట్లు జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల పరిధిలో, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జగదీష్ కోరారు.

టిడిపి మండల అధ్యక్షుడిగా బెల్లంకొండ మురళి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: చిన్న గొట్టిగల్లు మండల టిడిపి అధ్యక్షుడుగా మరోసారి బెల్లంకొండ మురళి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి చిన్నగొట్టిగల్లు మండల టిడిపి అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన కార్యకర్తపై పోలీసుల తీరు హేయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఓ వర్గం దాడిలో గాయపడి న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కి వెళ్లిన జన సైనికుడిపట్ల టూ టౌన్ పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ ఆపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వినుత మండిపడ్డారు. ఈ విషయమై వినుత సామాజిక మాధ్యమాలలో ఆదివారం రాత్రి వీడియోను విడుదల చేయడంతో అది వైరల్‌గా మారింది. జనసేన మండల ప్రధాన కార్యదర్శి నితీష్ కుమార్‌పై ఓ వర్గం రాడ్లతో దాడికి పాల్పడిందన్నారు. తీవ్రంగా గాయపడిన నితీష్ కుమార్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం, పోలీసులు బాధితుడ్ని గదిలోకి పిలిచి దాడికి పాల్పడినట్లు వినుత ఆవేదన వ్యక్తం చేశారు. తమ కార్యకర్తపై దాడిచేసిన వారిని, అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు చిత్తూరు డిఈఓ ఆఫీస్ ముట్టడి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీల నిబంధనలను సవరించాలని కోరుతూ బుధవారం చిత్తూరు డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పుత్తూరు డివిజన్ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. సోమవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిబంధనలు కనుగుణంగా రూపొందించిన గత ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయాలని తీవ్రమైన పోరాటం చేసిన తర్వాత, నూతన ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసినప్పటికీ, ఆశించిన ఫలితాలు ఉండేటట్లుగా చేయలేదని ఆరోపించారు. గతంలో ఆరు రకాల పాఠశాలలు ఉండగా వాటిని తొమ్మిది రకాల పాఠశాలలుగా మార్పు చేశారని, ప్రాథమిక పాఠశాల అంటే ఒకటి నుండి ఐదు తరగతులకు ఉండాల్సింది బదులు వాటిని ఐదు రకాల పాఠశాలలుగా విడగొట్టారని సంఘాల నాయకులు తెలిపారు. మోడల్ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా ఎస్ జిటి నుండి పదోన్నతి కల్పించాలని కోరారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలీకృతం కానందున, బుధవారం జరిగే డీఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, పిఆర్టియు, ఆఫస్, హెచ్ఎమ్స్ అసోసియేషన్, పీడీల అసోసియేషన్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంసిపి విధానంతో మహిళలకు విరివిగా రుణాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసిపి), బిజినెస్ యాక్టివిటీ ఎంటర్ ప్రిన్యూవర్ వివరాలను నమోదు చేసుకుని మహిళలకు విరివిగా రుణాల అందజేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. సోమవారం తిరుపతి గ్రామీణ మండలం ముండ్లపూడి గ్రామ సమైక్య సమావేశానికి హాజరై మైక్రో క్రెడిట్ ప్లాన్, బిజినెస్ యాక్టివిటీ ఎంటర్ ప్రిన్యూవర్ వివరాలను రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతి డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్ సూచనలతో బాలాజీ సంఘం సభ్యులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం సభ్యుల వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. మహిళలు డిమాండ్ ఉన్న ఇటువంటి వ్యాపారాలను చేపట్టాలని సూచించమన్నారు. డేటా నమోదులో సిసి, ఏపిఎం లాగిన్‌లలో కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీవనోపాధి డిపిఎం ధనంజయ రెడ్డి, బ్యాంకు లింకేజీ డిపిఎం ఆదినారాయణ, ఉన్నతి యాంకర్ పర్సన్ విజయ్ కుమార్, ఏపీఎంలు దుర్వాసులు నాయుడు, నాగేశ్వరరావు, ముని కృష్ణారెడ్డి, పలణి కుమార్, సీసీలు, వివోల అధ్యక్షులు, విఓఏలు, సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో అనారోగ్య సమస్యలు దూరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): యోగాలోని 108 సూర్య నమస్కారములు చేయడం వలన సమస్త అనారోగ్య సమస్యలు దూరమై ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉందని ప్రముఖ యోగ మాస్టర్, విశ్రాంత ఎఫ్ఆర్ఓ వాసుదేవ రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు తాను 33 నెలల కాలంలో 777 రౌండ్ల 108 సూర్య నమస్కారములు అనగా 85 వేల 20 సూర్య నమస్కారములు చేశానన్నారు. రోజు 30 నిమిషాల పాటు యోగాకు సంబంధించిన ఆసనాలను వేయగలిగితే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందుతామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బాలనారాయణ, చంద్రశేఖర్, మనోహర్, రామదాసు, నరసింహారెడ్డి, సుందర్ పాల్గొన్నారు.

జేమ్స్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళిత విద్యార్థి జేమ్స్‌పై కుల వివక్షతో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాల ని కాంగ్రెస్ పార్టీ నాయకు లు యార్లపల్లి గోపి డిమాం డ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత కక్షల నేపథ్యంలో దళిత విద్యార్థిపై దాడి చేయడమే కాకుండా, సమాజం తలదించుకునేలా వ్యవహరించిన వారిని పోలీసు ఉన్నతాధికారులు కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తేజోవతి, వెంకటేష్ గౌడ్, మసీద్ పటేల్, హేమంత్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులుగా రౌషన్ కుమార్ సిన్హా, సుఖ్జీందర్ మహేశరి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ నూతన కార్యవర్గం ఎన్నికయింది. ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షునిగా రౌషన్ కుమార్ సిన్హా , ప్రధాన కార్యదర్శిగా సుఖ్జీందర్ మహేశరి ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో ఈ నెల 15వ తేదీ నుంచి 18 వరకు ఘనంగా జరిగాయి. మహాసభల చివరి రోజు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రతినిధుల మహాసభలో 105 మందిని జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.కొత్తగా ఎన్నికైన కమిటీ వివరాలను ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ సోమవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులుగా భారతి, ప్రదీప్ సేథీ, హిమాన్షు, ఆర్తి రాధేఖర్, కార్యదర్శులుగా జిస్మోన్, హరీష్ బాల, డాక్టర్ సయ్యద్ వలీవుల్లా ఖాదరి, పరుచూరి రాజేంద్ర బాబు ఎన్నికయ్యారు. వీరితోపాటు 45 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

త్రిలోక్ చంద్రకు మాతృవియోగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు చెందిన వైసీపీ నాయకులు పెమ్మారెడ్డి త్రిలోక్ చంద్ర రెడ్డి తల్లి ఆదివారం మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, మాజీ ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనీల్ రెడ్డి, శ్రీ చెంగాళమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి త్రిలోక్ రెడ్డి నివాసానికి చేరుకుని ప్రభావతమ్మ దేహం వద్ద నివాళులర్పించారు.

వ్యర్థాలతో ఇబ్బంది.. సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -కోట : చెందోడు గ్రామ పంచాయతీలోని విద్యావికాస్ యాజమాన్యం బాత్ రూమ్‌లు నిర్మించి వాటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వదిలేయడంతో దుర్వాసన, దోమలు వల్ల వివిధ రకాల వ్యాధుల భారిన పడుతున్నామని బి.మస్తానా పర్వీన్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని సోమవారం కోట మండలం, చెందోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీ కిరణ్ కుమార్‌కు ఆమె వినతి పత్రం అందజేశారు. స్పందించిన పంచాయతీ త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

మండల నూతన కార్యవర్గం ఎంపిక



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే భాను ప్రకాష్ ఆదేశాల మేరకు సోమవారం టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు అధ్యక్షతన పుత్తూరు రూరల్ మండల నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆరవ బాలాజీ, కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఎం.విష్ణు ప్రసాద్, ఉప కార్యదర్శిగా గంగయ్య, శ్రీకాంత్ నాయుడు, గజపతి, ట్రెజరర్‌గా సి.నర్సింహులు, కార్యవర్గ సభ్యులుగా ఏ.హరిచంద్ర ప్రసాద్, బాలకృష్ణారెడ్డి, జి.రాజేంద్ర నాయుడులను ఎన్నుకున్నారు. అనంతరం పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య నూతనంగా ఎన్నికైన మండల టిడిపి పార్టీ కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బాలుడి నిర్బంధం.. వెట్టి చాకిరీ

- కుమారుడి ఆచూకీ తెలుపాలని అడిగిన తల్లిని కులం పేరుతో దూషణ

దోషులపై బాల కార్మిక నిరోధక చట్టం, అట్రాసిటీ కేసు నమోదు

విచారణ జరుపుతున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో బాలుడు వెంకటేశ్వర్

ప్రజాశక్తి - సత్యవేడు: బాలుడు వెంకటేశ్వర్‌ను(9) నిర్బంధించి వెట్టిచాకిరి చేయించుకోవడం, ఆ బాలుడు ఇప్పుడు కనిపించక పోవడం, ఆచూకీ అడిగిన బాలుడి తల్లిని కులం పేరుతో దూషించడంపై సత్యవేడు పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యవేడు పట్టణ దలవాయి అగ్రహారానికి చెందిన ముత్తు, ధనభాగ్యం, రాజశేఖర్‌లపై స్థానిక పోలీస్ స్టేషన్లో బాల కార్మిక చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పుత్తూరు డిఎస్పి రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు మండలం నెలటూరు సమీపాన చవటపాలెంలో అంకమ్మ కుటుంబం నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాతులు మేపడానికి దలవాయి అగ్రహారం చెందిన ముత్తు, ధనభాగ్యం ఇరువురు అంకమ్మతో పాటు వారి కుటుంబ సభ్యులను రెండేళ్ల క్రితం రప్పించుకున్నారు. ఈ క్రమంలో ఏడాది తర్వాత అంకమ్మ మొదటి భర్త చనిపోవడంతో దహన సంస్కారాల కోసం సొంత ఊరు చవటపాలెం వెళ్లాలనుకుంది. అయితే ఆ సమయంలో బాతులు మేపడానికి ఇచ్చిన అడ్వాన్సును ఇచ్చి వెళ్లాలని ముత్తు నిలదీశాడు. అడ్వాన్సు తిరిగి ఇచ్చేవరకు తన కుమారుడిని ఇక్కడే వదిలి వెళ్లాలని నిర్బంధం చేశాడు. మరేమీ దిక్కుతోచని స్థితిలో అంకమ్మ అడ్వాన్స్ సొమ్ముతో మళ్ళీ తిరిగి వస్తామని చెప్పి, తన చిన్న కుమారుడు వెంకటేశ్వర్‌ను ముత్తు వద్దే విడిచి సొంత ఊరికి వెళ్ళింది. అప్పటినుంచి ముత్తు బాలుడితో బాల కార్మిక చట్టానికి విరుద్ధంగా వెట్టి చాకిరి చేయించుకున్నాడు. (దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.) బాలుడు వెంకటేశ్వర్‌తో తరచూ తల్లి అంకమ్మ ఫోన్లో మాట్లాడుతూ ఉండేది. అంకమ్మ అడ్వాన్స్ డబ్బు తిరిగి చెల్లించడం ఆలస్యమవుతోంది. అయితే గత నెలగా తల్లి అంకమ్మతో బాలుడు మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి తల్లి సత్య వేడుకు చేరుకుంది. తన కుమారుడు ఎక్కడ అంటూ ముత్తును నిలదీసింది. అయితే వాడి ఆచూకీ తెలియడం లేదని గాలింపు చేపడుతున్నట్లు నిర్లక్ష్యంగా ముత్తు బదులిచ్చాడు. దీంతో అంకమ్మ తన కుమారుడు ఏడని, బ్రతికే ఉన్నాడా లేడా ఒకవేళ బ్రతికే ఉంటే తనకు అప్పజెప్పాలంటూ పట్టు పట్టడంతో ముత్తు ఆమెను కులం పేరుతో దూషించి బెదిరించాడు. అంకమ్మకు అనుమానం వచ్చి సోమవారం తన కుమారుడు కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై నిందితులు ముత్తు, ధనభాగ్యం, రాజశేఖర్‌లపై బాల కార్మిక చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాలుడు ఆచూకీపై దర్యాప్తు జరుపుతున్నట్టు పుత్తూరు డిఎస్పి రవికుమార్ చెప్పారు. ఈ దర్యాప్తులో స్థానిక సీఐ మురళినాయుడు, ఎస్ఐ రామస్వామి పాల్గొన్నారు.

వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి

దాడిలో గాయాలపాలైన హరి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మద్యం మత్తులో జరిగిన గొడవతో కక్ష పెంచుకుని ఓ వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి చేసిన ఘటన సోమవారం తిరుపతి లో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు చిత్తూరు జిల్లా, కార్వేటి నగరం మండలం, ఉత్తనూరు గ్రామానికి చెందిన అరకోణం హరి (34) కి వివాహం అయింది. ఇతనికి మద్యపానం అలవాటు ఉన్నందున ఇతని భార్య ఇతని నుండి 6 సంవత్సరాలుగా కూతురుని తీసుకొని వేరు కాపురం పెట్టింది. అప్పటి నుండి ఇతను ఇంకా ఎక్కువ మద్యానికి అలవాటు పడ్డాడు. ఇతను టైల్స్ పని చేసుకుంటూ పద్మావతి పురంలో జీవనం సాగిస్తున్నడు. ఇతనికి మూడు రోజుల క్రితం మద్యం తాగేటపుడు ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. ఆతనితో కలసి మద్యం సేవించి, ఆ సమయంలో గలాటా పడి అతన్ని హరి కొట్టాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతను సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో మాంగో మార్కెట్ ఎదురుగా గల ఆటో స్టాండ్ వద్ద ఒక్కడే కూర్చుని ఉన్న సమయంలో తన వద్దనున్న బీరు బాటిల్తో హరి చాతిపై పొడిచాడు. చుట్టుపక్కల వారు అరవడంతో పారిపోయాడు. గాయాల పాలైన హరిని స్థానికులు 108లో రుయా హాస్పిటల్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఘటన వివరాలను బాధితుని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరుశురామేశ్వరుడి సేవలో అంజనీ కుమార్



ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం పరశు రామేశ్వర స్వామి అమ్మవార్ల దర్శనార్థం ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిషన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ అధికారి అంజని కుమార్ ఐపీఎస్, కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, కార్యనిర్వహణ అధికారి రామచంద్ర రెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సిఐ శ్రీకాంత్ రెడ్డి, డి.ఎస్.పి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురిస్తే టో(తొ)ల్ తీస్తాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏర్పేడు–వెంకటగిరి జాతీయ రహదారి చింతలపాలెం టోల్ గేట్‌లో పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం దురుసుగా వ్యవహరిస్తోంది. మౌలిక వసతులు కల్పించాలని ప్రశ్నిస్తే టోల్ తీస్తామంటూ హెచ్చరిస్తోంది. అక్కడ పనిచేస్తున్న 12 మంది సిబ్బంది కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా లేకుండా పోయాయని వాపోతున్నారు. రాత్రి సమయాల్లో టోల్గేట్ వద్ద లైట్లు వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. దారి కనిపించగా కొంతమంది వాహనదారులు సిబ్బందిని ఢీ కొడుతున్నారనీ, గాయాల పాలవుతున్నామని వాపోతున్నారు. టోల్ గేట్‌కు అతి సమీపముగా వచ్చేవరకు దారి కనిపించకపోవడంతో వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారంటూ చింతలపాలెం సర్పంచ్ చింతా బాల ప్రసాద్ యాదవ్ మండిపడ్డారు. విద్యుత్ వ్యయాన్ని తగ్గించుకునేందుకు టోల్గేట్ యాజమాన్యం లైట్లు వేయకుండా సిబ్బంది, వాహనదారుల ప్రాణాలతో ఆటలాడుతుందని మండిపడ్డారు.